సాక్షి విశాఖపట్నం

శనివారం । 14 । డిసెంబర్ । 2024

I



ఆర్గానిక్ మేళాకు స్పందన


గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళాకు స్పందన లభిస్తోంది. IIలో



విద్యుత్ ఆదా వారోత్సవాలు

వాల్తేరు డివిజన్‌లో విద్యుత్ ఆదావారోత్సవాలు జరుగుతున్నాయి. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. IIలో

16న సింహగిరిపై నెలగంట



సింహగిరిపై ఈ నెల 16న నెలగంట ఉత్సవాన్ని విశేషంగా నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. IIలో



చేతికి తగిలిన గాయాన్ని చూపిస్తున్న చింతలపూడి

ఏకమై.. అన్నదాత గొంతుకై..



- కూటమి ప్రభుత్వ వైఖరిపై రైతుల ఆగ్రహం
- ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ నినాదాలు చేస్తూ పాదయాత్ర
- రైతులకు బాసటగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన
- కలెక్టరేట్ వరకు సాగిన యాత్ర
- వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు
- తోపులాటలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడికి స్వల్ప గాయాలు
- కూటమి సర్కారుపై వైఎస్సార్‌సీపీ తలపెట్టిన తొలిపోరు విజయవంతం



రైతులతో ర్యాలీగా వెళ్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవీంద్రబాబు, మేయర్ హరివెంకట కుమారి, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి, మళ్ల విజయప్రసాద్, నాగిరెడ్డి, తైనాల, చింతలపూడి, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు

'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ'కి అనూహ్య స్పందన

అందరికీ పట్టెడన్నం పెడుతున్న రైతుల పొట్టకొట్టింది కూటమి ప్రభుత్వం. ఆరుగాలం శ్రమిస్తున్న అన్నదాతకు 'భరోసా' కల్పిస్తూ అండగా నిలవాల్సిన సర్కారు.. అనాథగా వదిలేసింది. కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు సంతోషపడిన రైతు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వారి చేష్టలకు విసిగిపోయాడు. పొలంలో హలం పట్టాల్సిన కర్షకుడి కడుపుమండి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ప్లకార్డులు పట్టుకున్నాడు. కనీస మద్దతుధర కల్పించాలంటూ నినదించాడు.. పెట్టుబడి సాయం ఎక్కడంటూ ప్రశ్నించాడు. రోడ్డెక్కిన రైతన్నకు బాసటగా నిలుస్తూ.. 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' అడుగేసింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు రైతులతో కలిసి నిరసనకు నడుంబిగించింది. సూపర్ సిక్స్ కొట్టకుండా డకౌట్ అయిన కూటమి ప్రభుత్వ తీరుపై నినాదాలు చేస్తూ సాగిన ప్రదర్శన విజయవంతమైంది.. వైఎస్సార్‌సీపీ చేపట్టిన తొలిపోరుకు అనూహ్య స్పందన లభించడంతో..అధికార పార్టీ నేతల్లో అలజడి మొదలైంది. – సాక్షి, విశాఖపట్నం



అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమం శుక్రవారం ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ జంక్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం నుంచి ప్రారంభమైంది. భీమిలి నియోజకవర్గ పరిధిలో ఉన్న రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన యాత్రకు మద్దతు తెలిపేందుకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, మళ్ల విజయప్రసాద్, తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయ్ కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్‌సీపీ జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు హాజరయ్యారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూడా రైతులతో కలిసి అడుగు వేశాయి.శ్రీకృష్ణ మందిరం నుంచి వందల మంది పాదయాత్రగా బయలుదేరారు. ''తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలని''.. 'ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని', 'దళారీ వ్యవస్థను తొలగించి..ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాల్సిందే' అంటూ రైతులు నినాదాలు చేశారు.

ముందస్తు వ్యూహంతో కలెక్టరేట్ ఖాళీ

రైతుల పక్షాన పోరాటం చేస్తామంటూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన తర్వాత.. అలెర్ట్ అయిన ప్రభుత్వం..గడిచిన మూడు రోజులుగా కలెక్టర్ల సదస్సు, అనంతరం స్వర్ణాంధ్ర అభివృద్ధికి డాక్యుమెంట్ ఆవిష్కరణ అంటూ కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులను అమరావతికే పరిమితం చేసింది. దీంతో కలెక్టరేట్ నిర్మానుష్యంగా మారింది. డీఆర్వో భవానీశంకర్‌కు వైఎస్సార్‌సీపీ నేతలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. మొత్తంగా రైతుల పక్షాన పోరాటం చేస్తూ ప్రతిపక్ష హోదాలో వైఎస్సార్ సీపీ నిర్వహించిన తొలిపోరు విజయవంతం కావడంతో కూటమి ప్రభుత్వంలో కలవరం మొదలైంది.



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న జీవీఎంసీ కార్పొరేటర్లు

కలెక్టరేట్ వద్ద స్వల్ప ఉద్రిక్తత



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పార్టీ నేతలు

అంతవరకూ ప్రశాంతంగా సాగిన యాత్రకు వచ్చిన అనూహ్య స్పందన చూసి ఓర్వలేని ప్రభుత్వం.. పోలీసుల సాయంతో అణిచివేసేందుకు కుట్ర పన్నింది. శాంతియుతంగా నినాదాలు చేస్తూ.. సాధారణ ప్రజలకు ఎలాంటి విఘాతం కలిగించకుండా ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరుతూ అధికారులకు వినతి పత్రం అందించేందుకు రైతులతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్పటికే పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని నిలువరించాలని గేట్లు మూసేసి రోప్ పార్టీలతో నెట్టేసేందుకు యత్నించారు. ఈ సమయంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య గేటుపై పడటంతో.. ఓ ఇనుప చువ్వ తగిలి చేతికి గాయమైంది. మరో రైతు స్పృహ కోల్పోయాడు. అయినా పట్టించుకోని పోలీసులు వైఎస్సార్‌సీపీ నేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ప్రశాంతంగా జరుగుతున్న పోరాటాన్ని ఇలా ఉద్రిక్తంగా మార్చొద్దంటూ పోలీసులకు నేతలు చెప్పడంతో.. కొందర్ని మాత్రమే అనుమతిస్తామంటూ షరతులు విధించారు. దీంతో గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్లు కలెక్టరేట్‌లోకి వెళ్లారు.

పాల్గొన్న నేతలు వీరే...

పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవి రెడ్డి, పార్టీ రాష్ట్ర అనుబంధ సంఘాల అధ్యక్షులు వంగపండు ఉష, జాన్‌వెస్లీ, పేర్ల విజయ్ చందర్, జీవీఎంసీ కార్పొరేటర్లు అక్కరమాని పద్మ రామనాయుడు, కొండబాబు, ఉమ్మడి స్వాతి దాస్, గేదెల లావణ్య నాగరాజు, ముర్వల లక్ష్మీ సురేష్, పద్మా రెడ్డి, బిపిన్ కుమార్ జైన్, చెన్నై జానకి రాము, గుండమ్మ నాగేశ్వరరావు, కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, ఆళ్ల శంకర్రావు, రెయ్యి వెంకటరమణ, శశికళ, పీవీ సురేష్, మహమ్మద్ ఇమ్రాన్, ఉరుకూటి రామచంద్రరావు, కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, ఎండి షరీఫ్, పార్టీ నాయకులు రొంగలి జగన్నాథం, ఉరుకూటి అప్పారావు, వుడా రవి, చొక్కాకుల వెంకట్రావు, తిప్పల దేవన్ రెడ్డి , జహీర్ అహ్మద్, పేడాడ రమణకుమారి, ద్రోణంరాజు శ్రీ వాత్సవ, మొల్లి అప్పారావు, నడింపల్లి కృష్ణంరాజు, సుజాత సత్యనారాయణ, మాధవి వర్మ , పల్లా చిన్న తల్లి, అల్లంపల్లి రాజాబాబు, ఆల్ఫా కృష్ణ, ఎంపీపీలు మజ్జి వెంకట్రావు, రాంబాబు, జోనల్, జిల్లా పార్టీ నాయకులు పళ్ల దుర్గ, రామణపాత్రుడు, మారుతి ప్రసాద్, బోని శివరామకృష్ణ, బొండా శీను, బాపు ఆనంద్, పీతల వాసు, పీతల గోవింద్, లంక రాంబాబు, అనిల్, బి.పద్మావతి, అక్కరమాని మంగరాజు, జీలకర్ర నాగేంద్ర , అప్పన్న , హరి కిరణ్ రెడ్డి, జొగుపల్లి నరేష్ , శరత్‌చంద్ర , మహలక్ష్మి నాయుడు , దాడి నూకరాజు , వెంకట్రావు, ఇమంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం ప్రజల పక్షానే..

వైఎస్సార్‌సీపీ పోరు బాట పట్టడంతో కూటమి ప్రభుత్వం భయపడిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా.. హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆక్షేపించారు. నిరంతరం ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు అవుతున్న రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని రైతులకు కనీసం గిట్టుబాటు ధర కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

అప్పులు చేసి వ్యవసాయం



ఆనందపురం మండలంలో 8 వేలకు పైగా ఉన్న రైతులకు గత ఐదేళ్ల కాలంలో ఏటా రూ.6 కోట్లు చొప్పున రైతు భరోసా అందింది. ప్రతి ఒక్క రైతు సంతోషంగా వ్యవసాయం చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి సాయం అందలేదు. దీంతో ఈ 8 వేల మంది రైతులు అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అన్ని పార్టీలకు చెందిన వారు అనవసరంగా కూటమికి ఓటేశామని బాధపడుతున్నారు. టీడీపీకి మద్దతు ఇచ్చినందుకు రైతులు సిగ్గుపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులను ఆదుకోవాలి.

– మజ్జి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ ఆనందపురం మండల వర్కింగ్ ప్రెసిడెంట్

ఒక్క రూపాయి సాయం అందలేదు

గత ఐదేళ్ల కాలంలో ఉన్నట్లుగా ఈ సంవత్సరం లేదు. రైతులందరం చాలా ఇబ్బందులు పడ్డాం. ఖరీఫ్ వచ్చిందంటే ఏమాత్రం భయం ఉండేది కాదు. పెట్టుబడి సాయం అందేది. సకాలంలో ఎరువులు, విత్తనాలు వచ్చేవి. అప్పటిలా ఈ ఏడాది మేం సంతోషంగా లేం. పెట్టుబడి సాయం ఇస్తామన్నారు. ఇవ్వలేదు. ఖరీఫ్‌లో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం ఇస్తామన్న రూ.20 వేల పెట్టుబడి సాయం విడుదల చెయ్యాలి.

– అప్పలనాయుడు, రైతు, తర్లువాడ

రైతు భరోసా కేంద్రాలేవి.?



రైతు భరోసా మాత్రమే కాదు.. రైతులకు అందాల్సిన ఏ ఒక్క సాయం కూడా ఈ ప్రభుత్వం నుంచి ఇంత వరకూ అందలేదు. రైతులంతా చాలా ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వంలోకి రాక ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ రైతుకు అమలు చెయ్యడం లేదు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగపడేవి. ఇప్పుడు వాటిని పట్టించుకోకపోవడంతో అవన్నీ ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయి.

– కూన ఢిల్లీరావు, రైతు

జగన్ హయాంలోనే సంతోషంగా ఉన్నాం



నాకు 50 సెంట్లు పొలం ఉంది. గత ఐదేళ్లలో రైతు భరోసా బ్రహ్మాండంగా అందింది. ఈసారి ప్రభుత్వం నుంచి ఎలాంటి పెట్టుబడి సాయం ఇవ్వలేదు. దీంతో వడ్డీకి డబ్బులు తీసుకోవాల్సి వచ్చింది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఎలాంటి అడ్డు లేకుండా సమయానికి డబ్బులు పడేవి. మరే ఆలోచన లేకుండా హాయిగా వ్యవసాయం చేసుకునేవాళ్లం. ఇప్పుడు మళ్లీ అప్పులు చేసే దుస్థితికి వచ్చేశాం.

– కోరాడ సత్యారావు, రైతు, ఆనందపురం

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్ అదాలత్

విశాఖ–లీగల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో (శనివారం) డిసెంబర్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ శుక్రవారం ఓక ప్రకటనలో తెలిపారు. న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక తగాదాల కేసులు పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాగు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

మహారాణిపేట: జిల్లాలో సాగు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల కోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించి సాగునీటి వినియోగదారుల సంఘాలకు పాలక వర్గాలను ఎన్నుకుంటారు. 174 ప్రాదేశిక నియోజక వర్గం సభ్యులను ఓటర్లు ఎన్నుకుంటారు. భీమిలిలో 30 ప్రాదేశిక నియోజకవర్గాలు కలిపి మొత్తం 5 నీటి సంఘాలు, ఆనందపురం 24 ప్రాదేశిక నియోజకవర్గాలు నాలుగు నీటి సంఘాలు, పెందుర్తి 78 ప్రాదేశిక నియోజకవర్గాలు 13 నీటి సంఘాలు, పద్మనాభం 42 ప్రాదేశిక నియోజకవర్గాలు ఏడు నీటి సంఘాలకు ఎన్నికల నిర్వహించనున్నారు. 29 మంది ఎన్నికల అధికారులు, 29మంది అసిస్టెంట్లు, 58 పోలింగ్ అధికారులు, 58 మంది పోలింగ్ అసిస్టెంట్లను నియమించారు.

కాకినాడ సెజ్‌లో అక్రమాలపై విచారణ చేపట్టాలి

కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ఎమ్మెల్సీ బొత్స లేఖ

విశాఖ సిటీ: కాకినాడ సెజ్ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు, అక్రమాలపై వెంటనే సంబంధిత శాఖల అధికారులతో విచారణ జరిపించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు శుక్రవారం శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ లేఖ రాశారు. ఆ లేఖలోని వివరాల ప్రకారం.. 2000 సంవత్సరంలో కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్లకు సంబంధించి విధి విధానాలు ఖరారు చేసింది.

ఈ సెజ్‌లకు కొన్ని ప్రోత్సాహకాలు అందించింది. ఇతర రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా సెజ్‌ల ఏర్పాటుపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా కాకినాడలో సెజ్ ఏర్పాటు కోసం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం స్థానిక రైతుల నుంచి 10 వేల ఎకరాలకు పైగా భూములను సేకరించింది. ఈ సెజ్ అభివృద్ధి కోసం ఆ భూములను కేవీ రావు అనే ప్రమోటర్‌కు కేటాయించింది. అయితే సెజ్ ప్రమోటర్ విషయంలో కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ సమయంలో భూసేకరణ విషయంలో రైతులు నిరసన చేశారు. తక్కువ ధరకు భూములను స్వాధీనం చేసుకున్నారని తీవ్ర స్థాయిలో ఆందోళనకు చేపట్టారు. పశ్చిమ బెంగాల్‌లోని సింగూర్, నందిగ్రామ్‌లో జరిగిన ఆందోళన తరహాలోనే స్థానిక రైతులు పోరు బాట పట్టారు. రైతుల ఆందోళనలతో బెంగాల్ ప్రభుత్వం ఆ భూములు వెనక్కు ఇచ్చేసింది. అదే తరహాలో వైఎస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక రైతుల మనోభావాలు, కష్టాలను గుర్తించి గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి 2180 ఎకరాలను తిరిగి రైతులకు అప్పగించాలని సంకల్పించారు. అయితే ఆశ్చర్యకరంగా మాజీ స్పీకర్, మాజీ ఆర్థిక మంత్రి, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు కాకినాడ సెజ్ ప్రాజెక్టులో అక్రమాలపై ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ నెల 6న లేఖ రాశారు. ఇందులో భూ సమీకరణ నుంచి ప్రమోటర్ల వరకు అనేక వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయని, ఆ భూములను టీడీపీ గుర్తించిన ప్రమోటర్ కె.వి. రావు విక్రయించారు. ఈ తప్పులు, అక్రమాలపై సత్వరమే విచారణ జరిపించాలని బొత్స సత్యనారాయణ లేఖలో కోరారు.

ఏయూలో పాళి, బౌద్ధ అధ్యయనాలలో ఆన్‌లైన్ కోర్సు



సమన్వయ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పాళి, బౌద్ధ అధ్యయనాలలో ఆన్‌లైన్ కోర్సును శుక్రవారం ప్రారంభించారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ హాల్లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం, శ్రీ జయవర్ధనపుర విశ్వవిద్యాలయం, శ్రీలంక నుంచి వచ్చిన అధికారులు ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జయవర్ధనపుర విశ్వవిద్యాలయం వైస్–చాన్సలర్, సీనియర్ ప్రొఫెసర్ పత్మలాల్ మానగే పాల్గొన్నారు. ఆయన ఆంధ్రా విశ్వవిద్యాలయం పాళి, బౌద్ధ అధ్యయనాల విభాగంలో సహకార ప్రోగ్రాంను పెంచడం కోసం చేసిన కృషిని అభినందించారు. రెండేళ్ల ప్రోగ్రాం ప్రాముఖ్యతను సమకాలీన సమాజానికి వివరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టర్ ప్రొఫెసర్ కిశోర్ బాబు మాట్లాడుతూ ఈ జాయింట్ ప్రోగ్రాం ప్రాముఖ్యతను వివరించారు. రెండు విశ్వవిద్యాలయాల నుంచి ఈ కార్యక్రమాన్ని యోగ విభాగ ప్రొఫెసర్ థక్షిలా సమన్వయం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఏ.నరసింహారావు ,యోగ శాఖాధిపతి ప్రొఫెసర్ కే. రామేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ వెళ్తేనే కొత్త నాయకులు వస్తారు

పార్టీలో రాజీనామాలపై మాజీ మంత్రి గుడివాడ వ్యాఖ్యలు



సాక్షి, విశాఖపట్నం: అధికారంలో లేనంత మాత్రాన పార్టీ మారాలనుకోవడం అవివేకమని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ పార్టీకి రాజీనామా చేసిన సమయంలో ముత్తంశెట్టి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. తాడేపల్లి నుంచి వచ్చిన ఆదేశాలతోనే మంత్రి పదవి తీసుకుని అనుభవించిన ముత్తంశెట్టి.. రైతుల తరఫున పోరాటంలో భాగంగా నిరసనలకు పిలుపునిస్తే ఎందుకు ఇబ్బంది పడుతున్నారని ప్రశ్నించారు. గడిచిన ఐదేళ్ల 8 నెలల కాలంలో అవంతి శ్రీనివాస్ వల్ల వైఎస్సార్‌సీపీకి జరిగిన కాంట్రిబ్యూషన్ ఏంటో చెప్పగలరా అని ప్రశ్నించారు. రాజీనామా చేసిన వాళ్లు.. చెయ్యాలనుకునే వాళ్లు త్వరగా వెళ్లిపోవాలని వ్యాఖ్యానించారు. వైఎస్సార్‌సీపీలో స్క్రాప్ వెళ్లిపోతోందని చురకలంటించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక మాన్యుఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీ అనీ.. స్క్రాప్ వెళ్లిపోతే.. కొత్త నాయకుల్ని తయారు చెయ్యగల సత్తా ఆయనకు సొంతమన్నారు. ఒక ఎంపీ, ఎమ్మెల్యేతోనే పార్టీ ప్రస్థానం మొదలు పెట్టి.. అధికారంలోకి వచ్చిన విషయం ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని గుడివాడ అన్నారు.

మీడియాపై దాడులు సరికావు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మీడియా ప్రతినిధులు

- వైఎస్సార్ కడప జిల్లాలో సాక్షి మీడియాపై కూటమి నేతల దాడులు
- ఖండించిన మీడియా ప్రతినిధులు, జర్నలిస్టు సంఘాలు

సీతమ్మధార : సాక్షి మీడియా ప్రతినిధులపై జరిగిన దాడిని వివిధ జర్నలిస్టు సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ కడప జిల్లా వేముల మండల కేంద్రంలో నీటిసంఘాల ఎన్నికల ప్రక్రియ కవరేజ్‌కు వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామన్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిలపై రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని విశాఖ సాక్షి దినపత్రిక ప్రతినిధులు,పలు సంఘాల నాయకులు ఖండించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులుతో నిరసన తెలిపారు. జర్నలిస్టులు, మీడియా గొంతు నొక్కాలని అధికార పార్టీ నేతలు చూస్తున్నారన్నారు. దాడికి పాల్పడిన వారిని తీవ్రంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా జాయింట్ సెక్రటరీ పి.వేణుగోపాల్ మాట్లాడుతూ సాక్షి ప్రతినిధులపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాంటి దాడులు మళ్లీ జరిగితే ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా సహాయకార్యదర్శి కేటీ రామునాయుడు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేకతను తెలియపరిస్తే కూటమి ప్రభుత్వం సహించలేకపోతోందని మండిపడ్డారు. సాక్షి డెస్క్ ఇన్‌చార్జి బీబీ సాగర్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు సమాజానికి మంచివికావన్నారు. ప్రజల పక్షాన నిలిచే మీడియా గొంతునొక్కాలన్న ప్రభుత్వ విధానాలను అందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. వైజాగ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ కార్యదర్శి నవాజ్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడి చేయడం ద్వారా మీడియా గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారు. దాడికి పాల్పడిన వారిని తీవ్రంగా శిక్షించాలి భీమిలి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ రమణ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ సాక్షి బ్యూరో చీఫ్ కేజీ రాఘవేంద్రరెడ్డి, స్టాఫ్ రిపోర్టర్లు, డెస్క్ సభ్యులు, పలువురు విలేకరులు పాల్గొన్నారు.

15న జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

ఎంవీపీకాలనీ: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషులు, మహిళల జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 15న జరగనుంది. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాదరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏయూలోని బాస్కెట్‌బాల్ గ్రౌండ్ దరి ఓపెన్ గ్రౌండ్‌లో ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఎంపిక పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 22 నుంచి 25 తేదీ వరకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో జరగనున్న 50వ రాష్ట్ర జూనియర్ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయని చెప్పారు. 2005 జనవరి 12 తర్వాత జన్మించిన 70 కిలోల లోపు బరువున్న పురుషులు, 65 కిలోల లోపు బరువున్న మహిళలు ఈ ఎంపిక పోటీలకు అర్హులని తెలిపారు. ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రాలతో ఎంపికకు హాజరు కావాలని, పూర్తి వివరాలకు 96666 55355, 98495 56086 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఘనంగా విద్యుత్ ఆదా వారోత్సవాలు


ప్రదర్శనను తిలకిస్తున్న డీఆర్ఎం మనోజ్‌కుమార్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ రైల్వే డివిజన్ పరిధిలో ఈ నెల 8న ప్రారంభమైన విద్యుత్ ఆదా వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్ కుమార్ సాహూ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో విద్యుత్ ఆదా కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక బ్యానర్లు ప్రదర్శించడం, పోస్టర్లు, స్టిక్కర్లు, ర్యాలీలు వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. డీఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సెమినార్ జరిగింది. వాల్తేర్ డివిజన్ విద్యుత్ ఆదా కోసం అనుసరిస్తున్న ఆధునిక విధానాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందజేశారు. ఏడీఆర్ఎం ఈ. శాంతారాం, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎం.ఎస్.ఎన్.మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

16న సింహగిరిపై నెలగంట

- నెల రోజులపాటు ధనుర్మాసం పూజలు
- జనవరి 13న గోదా రంగనాథుల కల్యాణోత్సవం


గోదాదేవి అమ్మవారు

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 16న నెలగంట ఉత్సవాన్ని విశేషంగా నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆ రోజు నుంచి నెల రోజులపాటు ధనుర్మాసం పూజలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. సింహగిరిపై డిసెంబర్, వచ్చే ఏడాది జనవరిలో జరిగే విశేష ఉత్సవాలకు సంబంధించిన వివరాలను శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 16న ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆ రోజు ఉదయం 6.35 గంటలకు సింహగిరిపై రాజగోపురంలో నెలగంట మోగిస్తారు. స్వామికి, గోదాదేవికి విశేష పూజలు, తిరువీధి నిర్వహిస్తారు. నెలగంట సందర్భంగా ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి స్వామి దర్శనాలు ప్రారంభమవుతాయి.

31 నుంచి అధ్యయనోత్సవాలు

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈ నెల 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 20వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు జరుగుతాయి. ఈ నెల 31 నుంచి జనవరి 9 వరకు పగల్‌పత్తు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ప్రతి రోజూ ఉదయం స్వామికి తిరువీధి ఉత్సవం(అయ్యవారి సేవ) జరుగుతుంది. జనవరి 10 నుంచి 20వ తేదీ వరకు రాపత్తు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం 5 గంటలకు స్వామికి తిరువీధి జరుగుతుంది. రాపత్తు ఉత్సవాల రోజుల్లో రాత్రి 7 గంటల తర్వాత దర్శనాలు లభించవు. రాత్రి ఆరాధన టికెట్లు రద్దు చేశారు. వచ్చే ఏడాది జనవరి 13న సాయంత్రం ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణోత్సవం, జనవరి 15న కొండదిగువ పూలతోటలో స్వామి గజేంద్రమోక్షం ఉత్సవం జరుగుతుంది.

ఆర్జిత సేవలు రద్దు

అధ్యయనోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాల సందర్భంగా ఆలయంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 17వ తేదీ వరకు ఆర్జిత సేవలన్నీ రద్దయ్యాయి. డిసెంబర్ 16 నుంచి జనవరి 17 వరకు ఉదయం సుప్రభాత సేవ, ఉదయం ఆరాధన టికెట్లు రద్దు చేశారు. భక్తులంతా ఈ విషయాలను గమనించాలని ఈవో కోరారు.

ఏయూలో ‘టెక్సాస్’ వర్సిటీ ఆచార్యులు

విద్యా రంగంలో సహకారంపై చర్చలు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలను అమెరికాలోని టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ ఆచార్యులు సందర్శించారు. గ్రాడ్యుయేట్ స్టడీస్ విభాగం డీన్ టింగ్, పబ్లిక్ హెల్త్ విభాగం ప్రొఫెసర్ విజయ్ గొల్ల శుక్రవారం ఏయూ స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్, కంప్యూటర్ సైన్స్, విద్యా విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు విశ్వవిద్యాలయాల మధ్య సంయుక్తంగా పనిచేసే అంశాలపై, అంటే కోర్సుల నిర్వహణ, పరిశోధన రంగం మొదలైన వాటిపై ప్రాథమిక చర్చలు జరిపారు. విద్యా విభాగంలో విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య టింగ్ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించడానికి రావాలని ఏయూ విద్యార్థులను ఆహ్వానించారు. ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామని తెలిపారు. ఏయూతో కలిసి పనిచేయ



మాట్లాడుతున్న టెక్సాస్ వర్సిటీ డీన్ టింగ్

డానికి గల అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానమిచ్చారు. ఆటిజం సమస్యను పరిష్కరించేందుకు ఏఐ, ఎంఎల్ సాంకేతికతలను వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ ఎంఈడీ, బీఈడీ కోర్సులతో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అమెరికా ఆచార్యులను ఏయూ ప్రతినిధులు సత్కరించారు. రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ కె.బసవయ్య, విభాగాచార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పట్టపగలే చోరీలు.. దొంగల అరెస్ట్

25.7 తులాల బంగారం, 50.5 తులాల వెండి వస్తువుల స్వాధీనం

అక్కిరెడ్డిపాలెం

పగటిపూట ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు క్రైం డీసీపీ కె.లతామాధురి తెలిపారు. గాజువాక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గాజువాకలోని సింహగిరికాలనీలో పుత్తిరెడ్డి కుసుమ కుమారి కుటుంబం నివాసం ఉంటోంది. కుసుమ కుమారి ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా, ఆమె భర్త ప్రైవేట్ కాంట్రాక్ట్ వర్కర్. వారు ఇంటి తాళాలను మెయిన్ డోర్ వద్ద ఉన్న షూ స్టాండ్‌లో ఉంచి విధులకు వెళ్తుంటారు. కుసుమ కుమారి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి


వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ లతామాధురి

తిరిగి వస్తుంటారు. కాగా.. ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం ఆమె ఇంటికి వచ్చినప్పుడు ఇంటి ప్రధాన తలుపు తెరిచి ఉండటం గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లో బీరువా తెరిచి ఉండటం, అందులోని 20 తులాల బంగారు వస్తువులు, 25 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే ఆమె గాజువాక క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో ఇదే తరహా దొంగతనాలకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో నాలుగు ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో క్రైం డీసీపీ కె.లతా మాధురి, ఏడీసీపీ మోహనరావు, ఏసీపీ లక్ష్మణరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వ


రికవరీ చేసుకున్న బంగారు, వెండి వస్తువులు

ర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటైంది. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా ఈ కేసులో ప్రధాన నిందితుడైన జగదీష్‌ను గాజువాక బీసీ రోడ్డు మసీదు సెంటర్‌లో అరెస్ట్ చేశారు. అతనిది కృష్ణా జిల్లాలోని గుడివాడ జగనన్న కాలనీ. అతనికి సహకరించిన తణుకు నియోజకవర్గం పైడివాడలోని నాగేంద్రనగర్‌కు చెందిన ఇమ్మంది జ్యోతి శివను కూడా అరెస్ట్ చేశారు. వీరిద్దరి నుంచి 25.7 తులాల బంగారం, 50.5 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు జగదీష్‌పై ఇది వరకే పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయని డీసీపీ లతా మాధురి తెలిపారు.

గ్రీన్‌బెల్ట్‌లో అక్రమ నిర్మాణాల తొలగింపు


గ్రీన్‌బెల్ట్‌లో అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న సిబ్బంది

కంచరపాలెం: బిర్లా కూడలి సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని గ్రీన్‌బెల్ట్ స్థలాన్ని ఏఎస్ఎన్ మెగా మాల్ ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను శుక్రవారం జోన్-5 టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు శుక్రవారం ఈ ప్రాంతాన్ని సందర్శించారు. గ్రీన్‌బెల్ట్‌లో మొక్కలు తొలగించి సర్వీస్ రోడ్డు వరకు నిర్మాణాలు చేపట్టినట్లు ఆయన గుర్తించారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ ఏసీపీ శర్మ నేతృత్వంలో సిబ్బంది నిర్మాణాలను తొలగించారు. జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఆర్వో బాబూరావు, కె.కార్తీక్ పాల్గొన్నారు.

ఆర్గానిక్ మేళాకు అనూహ్య స్పందన


మేళాలో సామగ్రిని కొనుగోలు చేస్తున్న నగర ప్రజలు

విశాఖ విద్య: గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, రైతు సాధికారత సంస్థల ఆధ్వర్యంలో ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళాకు నగరవాసుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. గో ఆధారిత, సేంద్రియ సాగుతో పండించిన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల కోసం 200 స్టాళ్లు, ఖాదీ ఉత్పత్తులకు సంబంధించి 10 స్టాళ్లను ఇక్కడ ఏర్పాటు చేశారు. అదే విధంగా వివిధ తినుబండారాలను కూడా స్టాళ్లలో విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు నగరవాసులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. చిరుధాన్యాలు, మట్టి పాత్రలు, సహజ సిద్ధమైన నూనెలు, చర్మ సౌందర్యం కోసం ఆయుర్వేదంతో తయారు చేసిన వివిధ రకాల లేపనాలు, అటవీ ప్రాంతాల్లో లభించే సుగంధ ద్రవ్యాలు ఇలా ఇంటిల్లిపాదికి అవసరమైన సామగ్రి ఇక్కడ అందుబాటులో ఉంది. మేళాలో అందరికీ స్వాగతం పలుకుతూ సువాసనలు వెదజల్లే పూలమొక్కలు ఎంతో ఆకర్షణీయంగా నిలుస్తున్నాయి.

భారతీయ వైద్య విధానాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఆయుష్ విభాగం అందరి ఆరోగ్యం కోసం ఏర్పాటు చేశారని మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. ఆర్గానిక్ మేళాలో శుక్రవారం ‘మీ చేతిలో మీ ఆరోగ్యం’ కార్యక్రమం జరిగింది. ఈ


మట్టి పాత్రల తయారీని వివరిస్తున్న కళాకారుడు

సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లోపతి అన్ని రకాల వైద్య విధానాలను వెనక్కి నెట్టిందని, ప్రతి ఒక్కరూ భారతీయ వైద్య విధానాన్ని బతికించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించడానికి ఆయుర్వేద, నేచురోపతి, హోమియోపతి, యోగా ఉపకరిస్తాయని వివరించారు. భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమార్ స్వామి మాట్లాడుతూ శనివారం ఫుడ్ ప్రాసెసింగ్, 15న మిద్దె తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రైతు సాధికారత సంస్థ రాష్ట్ర థీమాటిక్ లీడర్ బి.ప్రభాకర్, ఆయుష్ శాఖ ఆర్డీడీ ఝాన్సీరాణి, హోమియోపతి వైద్యులు కొంగర రమేష్, యోగా గురువు పైడం నాయుడు, సిద్ధ వైద్యులు జగదీష్, ఆయుర్వేద వైద్యులు సుందర్ రాజ్ పెరుమాళ్, నేచురోపతి వైద్యులు డాక్టర్ రజితారోయ్(గుర్ల), డాక్టర్ రామలక్ష్మి(తురకలపూడి) తదితరులు మాట్లాడారు.

స్కేటింగ్‌లో గ్రీష్మ పతకాల పంట


పతకాలతో స్కేటర్ గ్రీష్మ

విశాఖ స్పోర్ట్స్: విశాఖ స్కేటర్ గ్రీష్మ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు సాధించింది. తమిళనాడులోని పొల్లాచిలో జరిగిన జాతీయ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీ పోటీల్లో గ్రీష్మ ఫ్రీస్టయిల్ స్కేటింగ్, పెయిర్ స్కేటింగ్, ప్రిసిషన్ విభాగాల్లో విజేతగా నిలిచి స్వర్ణ పతకాలు గెలుచుకుంది. అలాగే క్వార్టెట్ విభాగంలో రజతం, కపుల్ డ్యాన్స్ విభాగంలో కాంస్య పతకాలను సొంతం చేసుకుంది. కోచ్ సత్యనారాయణ శిక్షణలో రాణిస్తున్న గ్రీష్మ.. తల్లి షర్మి ప్రోత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొని విజయాలు సాధించింది.

సుస్థిరత, ఆవిష్కరణలే భవిష్యత్తు వ్యాపార సూత్రాలు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ అమిత్

తగరపువలస: బాధ్యతాయుతమైన వ్యాపార విధానాల భవిష్యత్తును రూపొందించడంలో ఆవిష్కరణలు, స్థిరత్వం కీలకమని ఐఐఎం విశాఖపట్నం(ఐఐఎంవీ) డీన్ (పరిశోధనాత్మక) ప్రొఫెసర్ అమిత్ శంకర్ అన్నారు. ఐఐఎంవీ ‘సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్’ క్యాంపస్‌లో శుక్రవారం ‘ఆవిష్కరణలు, సుస్థిరత ప్రాక్టీసెస్-2024’పై కేస్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో సుస్థిరత, బాధ్యతాయుతమైన నిర్వహణ పద్ధతులపై విద్యావేత్తలు, మేధావులు, పరిశ్రమల నిపుణులు ప్రసంగిస్తారన్నారు. ప్రపంచ సవాళ్లకు పరిష్కారాలను అందించడానికి సుస్థిరమైన, అర్థవంతమైన చర్యలు చేపట్టడమే లక్ష్యమని ఆయన తెలిపారు. టైమ్స్ ప్రో గ్రోత్ అండ్ పార్టనర్‌షిప్ అధికారి సునీల్ సూద్ మాట్లాడుతూ సుస్థిరమైన వ్యాపార పద్ధతులను ప్రోత్సహిస్తూ, ఉత్తమ ఫలితాల కోసం పెద్దన్న పాత్ర పోషిస్తామన్నారు.

‘కార్మికుల వేతనాల పెంపుపై హర్షం’


మాట్లాడుతున్న యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆనందరావు

డాబాగార్డెన్స్: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాల పెంపుపై జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. యూనియన్ కార్యాలయంలో శుక్రవారం యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహాదేవ్ ఆనందరావు మాట్లాడారు. నీటి సరఫరా విభాగం కార్మికులు, వివిధ కేటగిరీల్లోని ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు, టర్న్‌కాక్స్, బోర్ మెకానిక్‌లు, ఫిట్టర్/ఎలక్ట్రికల్ హెల్పర్ల అర్హత, అనుభవం మేరకు వేతనాలు చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదించడంపై ఆనందం వ్యక్తం చేశారు. అన్ని పార్టీల కార్పొరేటర్లకు ధన్యవాదాలు తెలిపారు. 169 మంది కార్మికుల నియామకంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు నేపథ్యంలో.. కమిటీ వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. అధ్యక్షుడు ఇ.రామకృష్ణ, కార్యదర్శి రెల్లి సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి జీవన్ పాల్గొన్నారు.

బాల నేరస్తుడి అరెస్ట్

టీచ్‌రోడ్డు: రాత్రి సమయంలో ఒంటరిగా వెళ్తున్న వారి వద్ద నుంచి బంగారం, నగదు, మొబైల్ ఫోన్లు చోరీ చేస్తున్న కంచరపాలేనికి చెందిన బాల నేరస్తుడిని శుక్రవారం మూడో పట్టణ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివీ.. మూడో పట్టణ స్టేషన్‌లో పరిధిలో షాపు నుంచి ఇంటికి వెళ్తున్న మహిళ వద్ద నుంచి నగదు, మొబైల్ ఫోన్ చోరీ, సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న వ్యక్తి నుంచి మొబైల్ చోరీ జరిగినట్లు ఇటీవల కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఓ వ్యక్తి నిందితుడి సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు పోలీసులు మద్దిలపాలెంలో నిందితుడిని అరెస్ట్ చేసి.. బాలల హోమ్‌కు తరలించారు. అతనిపై వేర్వేరు పోలీస్ స్టేషన్లలో 11 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ ప్రత్యక్ష ప్రసారం

మహారాణిపేట: స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణలో జిల్లా నుంచి వివిధ విభాగాల అధికారులు భాగస్వాములయ్యారు. విజయవాడలో శుక్రవారం జరిగిన విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీసీ హాలులో ప్రత్యక్ష ప్రసారం చేశారు. డీఆర్వో బి.హెచ్.భవానీ శంకర్, ఎస్‌డీసీ శేష శైలజ, డీపీవో శ్రీనివాసరావు, డీఎస్‌వో భాస్కరరావు, విభిన్న ప్రతిభావంతుల విభాగం ఏడీ మాధవి, మైనారిటీ వెల్ఫేర్ అధికారి జ్యోతి మాధవి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా ప్రాజెక్టులు

విశాఖ సిటీ: విశాఖ అభివృద్ధి కోసం పర్యాటక శాఖతో సమన్వయం చేసుకుంటూ.. పర్యాటకులను ఆకర్షించే ప్రాజెక్టులకు తగిన ప్రాధాన్యమివ్వాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఇంజినీరింగ్, ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయాన్ని అనుసంధానం చేసేలా రహదారుల నిర్మాణంపై దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రాజెక్టులన్నీ నిర్దేశించిన గడువులోగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. త్వరలో అన్ని ప్రాజెక్టులను క్షేత్ర స్థాయిలో పర్యటించి, పరిశీలన చేస్తానన్నారు. ప్లానింగ్ విభాగానికి వచ్చే లేఅవుట్లు, భవన అనుమతులు, భూ వినియోగ మార్పిడి దరఖాస్తుల పరిశీలనలో జాప్యం జరగకూడదన్నారు. చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బాలరామరాజు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల విజేత ‘ప్రగతి’


పోల్ డైవ్‌తో ప్రత్యర్థిని ఔట్ చేస్తున్న క్రీడాకారిణి

విశాఖ స్పోర్ట్స్: ఏయూ అంతర్ కళాశాలల ఖోఖో వుమెన్ జట్ల ఎంపిక పోటీల్లో ప్రగతి కళాశాల విజేతగా నిలిచింది. ఫైనల్‌లో ప్రగతి కళాశాల క్రీడాకారిణి ప్రత్యర్థికి చెందిన బుల్లయ్య కళాశాల క్రీడాకారిణులు ఇద్దరిని ఔట్ చేయగా.. ప్రతిగా బుల్లయ్య ఒక్కరిని మాత్రమే ఔట్ చేసి ద్వితీయ స్థానంలో నిలిచింది. తృతీయ స్థానంలో ఆతిథ్య విశాఖ వుమెన్స్ డిగ్రీ పీజీ కళాశాల జట్టు నిలిచింది. విశాఖ వుమెన్స్ కళాశాలలో శుక్రవారం ఒక్క రోజు జరిగిన ఈ పోటీల్లో తొమ్మిది జట్లు పోటీపడ్డాయి. ప్రారంభ పోటీలో టాస్ గెలిచి డిఫెండ్ చేసుకున్న ఎస్.వి.ఎల్.ఎన్ భీమిలి జట్టుపై నక్కపల్లి ప్రభుత్వ కళాశాల జట్టు విజయం సాధించింది. ఐదు నిమిషాల వ్యవధితో పోటీలు జరిగాయి. పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన వారిని ఏయూ జట్టుగా ఎంపిక చేయనున్నారు. తొలుత పోటీల ప్రారంభ కార్యక్రమానికి విశాఖ వుమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజుల అధ్యక్షత వహించగా ఏయూ వ్యాయామ విద్య సంచాలకుడు విజయ్‌మోహన్, హెడ్ పల్లవి పాల్గొన్నారు. పోటీలను విశాఖ వుమెన్స్ కళాశాల పీడీ కిరణ్మయి పర్యవేక్షించారు.